క్లుప్తంగా

మోడల్ కాలేజ్‌లో అట్టహాసంగా 'ఆరంభ్'



మిస్ స్మార్ట్, మిస్టర్ స్మార్ట్‌లతో టీచర్లు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలోని మోడల్‌కాలేజ్‌లో శుక్రవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండో సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఆరంభ్ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్ మాట్లాడుతూ ఇంటర్ కోర్సుల్లో విజయం సాధించడానికి విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవాలన్నారు. ఆరంభ్ కార్యక్రమంలో విద్యార్థులలో రూపురేఖలు, ప్రతిభ ఆధారంగా లక్ష్మీప్రసన్నను మిస్ స్మార్ట్‌గా, అబ్దుల్ సయిద్‌ను మిస్టర్ స్మార్ట్‌గా ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

జన సురక్షపై అవగాహన



శెట్పల్లిసంగారెడ్డిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీసీసీబీ అధికారులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లిసంగారెడ్డిలోని సొసైటీలో శుక్రవారం జన సురక్ష, ప్రమాదబీమాపై రైతులకు ఎన్‌డీసీసీబీ బ్యాంకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన ద్వారా వచ్చే ప్రమాద బీమా, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా, సహజ మరణాలకు వచ్చే బీమా తదితర విషయాలను రైతులకు వివరించారు. ఎన్‌డీసీసీబీ బ్యాంకు మేనేజర్ కుమారస్వామి, ఎస్ఎస్ రెడ్డి, ఎఫ్ఎల్‌సీ ప్రమోద్‌గౌడ్, కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ రాకేష్‌గుప్తా, సహకార సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలని వినతి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

కామారెడ్డి టౌన్: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వ కృషి చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో వీణకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. పెన్షన్, వైన్స్ షాపులలో టెండర్లు లేకుండా 4శాతం రిజర్వేషన్లు, వివాహ ప్రోత్సాహక బహుమతి రూ. 5లక్షలు, దివ్యాంగుల పిల్లలకు కార్పొరేట్ స్కూల్‌లో 4శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, రాజనర్సు, హుస్సేన్, సాయిరాం, లక్ష్మారెడ్డి తదితరులున్నారు.


విద్యార్థులకు ఉచిత బస్సుసౌకర్యం కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచితబస్సు సౌకర్యం కల్పించాలని బీసీఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ శ్వేతకు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు రాజు, రాజశేఖర్, నితిన్, మోహన్, రవి, భాస్కర్, బాలు, నరేందర్, సుధాకర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత నుంచి ఉన్నత పాఠశాలకు...



జనగామలో విద్యార్థులతో టీచర్లు

బీబీపేట: మండలంలోని జనగామ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మారుస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇప్పటికే తొమ్మిదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 20 మందిని పదవ తరగతిలో చేర్చారు. వారికి శుక్రవారం నుండి తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. భిక్‌నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్, ప్రజాప్రతినిధులు ఎల్లం, రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

నాయకులుగా తీర్చిదిద్దేందుకు..

- నస్రుల్లాబాద్ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 'విద్యార్థి' ఎన్నికలు
- బ్యాలెట్ పేపర్, పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన సిబ్బంది
- ఓటు వేసిన విద్యార్థుల్లో ఆనందం





పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న విద్యార్థులు

నస్రుల్లాబాద్ : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థి ఎన్నికలు నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన విద్యార్థులను ఉపాధ్యాయులు భవిష్యత్ తరం నాయకులుగా తీర్చిదిద్దనున్నారు. పాఠశాలకు స్కూల్ కెప్టెన్, స్పోర్ట్స్ కెప్టెన్, కల్చరల్ లీడర్, మెడికల్ లీడర్, వాటర్ అండ్ ఎలక్ట్రికల్ లీడర్, మెస్ లీడర్, క్రమశిక్షణ కెప్టెన్ వంటి ఏడు విభాగాలకు ఇద్దరి చొప్పున మొత్తం 14 మంది ఎన్నిక జరిగింది. పాఠశాలలోని 554 మందికి విద్యార్థులకు ఓటింగ్ అవకాశం కల్పించారు. ఈపదవులకు గాను 26 మంది గురువారం ఎన్నికల అధికారికి నామినేషన్ సమర్పించారు. స్కూల్ కెప్టెన్, స్పోర్ట్స్ కెప్టెన్ పదవికి ఒక్క నామినేషన్ రావడంతో ఏకగ్రీవంగా ప్రకటించి, మిగిలిన 12 పదవులకు శుక్రవారం ఎన్నికలను నిర్వహించారు. గెలిచిన వారు బాధ్యతలు స్వీకరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల తరహాలో ..

ఎమ్మెల్సీ ఎన్నికలకు పాటించే నిబంధనలను పాటిస్తూ విద్యార్థి ఎన్నికలను పాఠశాల సిబ్బంది నిర్వహించారు. ఇందులో భాగంగానే మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థికి బ్యాలెట్ పేపర్ అందించి సీరా చుక్కను వేలుపై పూశారు. నిబంధనలను పాటిస్తూ విద్యార్థులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ప్రతి విద్యార్థికి పాఠశాల స్థాయి నుంచే ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు ఈకార్యక్రమం నిర్వహించారు.

ఎన్నికైన కెప్టెన్లు చేయాల్సిన విధులు

స్పోర్ట్స్ కెప్టెన్ : పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న క్రీడలకు సంబంధించి అన్ని విషయాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. మండల,జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో జరిగే క్రీడల విషయాలన్నింటిని కూడా పర్యవేక్షించి ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉంటారు.

కల్చరల్ లీడర్ : పాఠశాలలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలన్నింటిని పర్యవేక్షిస్తారు.

మెడికల్ లీడర్: పాఠశాలలో సిక్ అయిన ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి యోగా క్షేమాలు తెలుసుకొని పర్యవేక్షిస్తారు.

వాటర్ అండ్ ఎలక్ట్రికల్: పాఠశాలలో నీటి సమస్య రాకుండా, ఆయా గదులలో ఉన్న ఎలక్ట్రికల్ వస్తువుల పనితీరును పర్యవేక్షిస్తూ ఉంటారు.

మెస్ లీడర్: మెస్ లో పరిశుభ్రంగా ఉండే విధంగా, మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించే విధంగా చూడాలి.

క్రమశిక్షణ/పాఠశాల కెప్టెన్ : విద్యార్థులు క్రమశిక్షణ పెంపొందేలా పర్యవేక్షిస్తూ ఉంటారు. వీరందరిని సమన్వయపరుస్తూ ఎప్పటికప్పుడు ఆయా విభాగాల్లో పనితీరును పరిశీలిస్తూ పాఠశాల కెప్టెన్ ఉంటారు. ఈవిషయాలను కళాశాల ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్తాడు.



ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థులు

సరైన వ్యక్తిని ఎన్నుకున్నా



ఓటుతో సరైన వ్యక్తిని ఎన్నుకున్నా. ఓటింగ్ జరుగుతుండగా దూరం నుంచి చూశా. ప్రత్యక్షంగా వాతావరణం గమనించడం ఇదే మొదటి సారి. చాలా సంతోషంగా ఉంది.

– శేఖర్, 10వ తరగతి

పాఠశాలలో ఎన్నికల వాతావరణం



గత నాలుగు రోజులుగా పాఠశాల ప్రాంగణంలో ఎన్నికల వాతావరణం నెలకొంది. అభ్యర్థుల ప్రచారం జరిగింది. పాఠశాలలో వారి వారి పదవులకు వారు చేసే పనులను వివరించారు.

– కె.శ్రీవత్ 10వ తరగతి

నాయకత్వ లక్షణాలు పెంచేందుకు



విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఎన్నికల పై పూర్తి అవగాహన కల్పించడం కోసం పోలింగ్ నిర్వహించాం. పోలింగ్ నియమాలను వివరించాం.

– మాధవరావు, ప్రిన్సిపాల్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



సోమేశ్వర్‌లో ఈతమొక్కలు నాటుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు



లింగంపల్లి (ఖుర్దు)గ్రామ చెరువు కట్టపై..



మొక్కలను పంపిణీ చేస్తున్న అధికారులు

బీబీపేట/లింగంపేట/నాగిరెడ్డిపేట/బాన్సువాడ రూరల్/మాచారెడ్డి : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బీబీపేట ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్ అన్నారు. శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా మాందాపూర్ గ్రామంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.లింగంపేట మండలం లింగంపల్లి(ఖుర్దు) గ్రామ ఊర చెరువు కట్టపై ఎక్సైజ్ అధికారులు ఈత మొక్కలను నాటారు. నల్లమడుగు గ్రామంలో ఉపాధి హామి కూలీలు మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో ఎంపీడీవో నరేష్, ఎస్సై దీపక్ అధికారులు మొక్కలు నాటారు.

నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట మోడల్ స్కూల్‌లో ఫారెస్ట్ అధికారులు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను ప్రతి విద్యార్థి సంరక్షణ చర్యలు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎఫ్ఆర్‌వో వాసుదేవ్ సూచించారు.బాన్సువాడ ఎంపీడీవో ఆనంద్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది సంయుక్తంగా గ్రామంలోని దేవుని చెరువుకట్ట పై ఈత మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో ఆనంద్ సూచించారు. మాచారెడ్డి మండలం అక్కాపూర్ ఉన్నత పాఠశాలలో అన్నారం సెక్షన్ అధికారి రామకృష్ణ మొక్కలు నాటి వాటికి నీరు పోశారు.

కుంగిన దిమ్మెను సరి చేశారు



అధికారులు సరిచేసిన దిమ్మె

సాక్షి ఎఫెక్ట్..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను శుక్రవారం అధికారులు సరి చేశారు.'కుంగిన ట్రాన్స్‌ఫార్మర్ గద్దె' అనే శీర్షికన గురువారం ప్రచురితమైన కథనానికి ట్రాన్స్ కో అధికారులు స్పందించి గద్దెను సరి చేశారు. మండల కేంద్రానికి చెందిన ప్రజలు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

బీఎస్పీని బలోపేతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

కామారెడ్డి అర్బన్: బహుజన సమాజ్ పార్టీ నాయకులందరు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ వహించి పార్టీని ప్రజల్లో బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్ అధ్యక్షత వహించారు. జిల్లా ఇంచార్జిగా కొక్కొండ రాజేందర్, కామారెడ్డి అసెంబ్లీ ఇంచార్జిలుగా ఈసిరికాయల సాయిలు, లింగం, కామారెడ్డి అసెంబ్లీ అధ్యక్షుడుగా నత్తి జీవన్, ఉపాధ్యక్షులుగా దుబ్బాక నవీన్‌లను నియమించారు. సమావేశంలో ఆయా నియోజకవర్గాల ఇంచార్జిలు రోహిదాస్, ఎం.సాయిబాబు, బజార్ ప్రభాకర్ దాస్, నాయకులు జి.ప్రవీణ్, విద్యాసాగర్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో విద్యుత్‌తో జాగ్రత్తలు



తుజాల్‌పూర్‌లో పొలంబాటలో పాల్గొన్న అధికారులు

బీబీపేట: వర్షాకాలంలో ప్రజలు విద్యుత్‌తో జాగ్రత్తగా ఉండాలని మండల విద్యుత్ శాఖ అధికారి విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం విద్యుత్ శాఖ అధ్వర్యంలో మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ రైతులతో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ చంద్రకాంత్, లైన్ ఇన్స్పెక్టర్ సంపత్ రెడ్డి, సిబ్బంది రైతులు ఉన్నారు.

టేక్రియాల్‌లో..

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని టేక్రియాల్‌లో శుక్రవారం విద్యుత్ అధికారులు పొలం బాట కార్యక్రమం నిర్వహించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు వానకాలంలో బోరుబావులు వద్ద తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించే కరపత్రాలను అందజేశారు. టేక్రియాల్ శివారులోని ఎస్ఎస్1/100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

నేటి చిత్రం



నిరుపయోగంగా పల్లె ప్రకృతి వనం

నస్రుల్లాబాద్ : మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో పల్లె ప్రకృతి వనం నిరుపయోగంగా ఉంది. పల్లెప్రకృతి వనంపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పిచ్చి మొక్కలతో నిండిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి ప్రకృతి వనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి.

–రాజు,బొమ్మన్‌దేవ్‌పల్లి

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

బీఎల్‌వోలు విధులు సక్రమంగా నిర్వహించాలి

ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉంటూ వారి విధులను సక్రమంగా నిర్వహించాలని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి సూచించారు. నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఎల్‌వోల విధులు, నూతన ఓటర్ల నమోదు తదితర అంశాలపై ఆయన వివరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్ బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయం తనిఖీ..

నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయాన్ని ఆర్డీవో పార్థసింహారెడ్డి తనిఖీ చేశారు. ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా మండలానికి వచ్చిన ఆయన కార్యాలయంలోని పలుగదులను, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు సహకరించి వారి పనులను చేయాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

రేషన్ డీలర్లు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి

ఎల్లారెడ్డిరూరల్ : రేషన్ డీలర్లు వినియోగదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని ఆర్డీవో పార్థసింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో రేషన్ డీలర్లతో ఆయన మాట్లాడుతూ ప్రతి రేషన్ దుకాణంలో నూతనంగా కార్డులు రావడం జరిగిందన్నారు. అనంతరం రేషన్ డీలర్లు నూతనంగా వచ్చిన ఆర్డీవోను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగం సురేందర్, పలు మండలాల రేషన్ డీలర్లు నర్సింలు, ,చంద్రయ్య, నయీమ్, విఠల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

అమ్మవారికి బంగారు నెక్లెస్ విరాళం



దోమకొండ: దోమకొండలోని చాముండేశ్వరి దేవాలయంలో బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి గ్రామానికి చెందిన కూర సాయిసంగీత్ రూ.50 వేల విలువైన ఐదుగ్రాముల బంగారు నెక్లెస్‌ను ఆలయ కమిటీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సిద్దారెడ్డికి అందజేశారు. దాతలను ఆలయ కమిటీ తరపున సన్మానించారు. ఆలయ అర్చకులు భావి శరత్ చంద్రశర్మ, ధర్మకర్తలు రమేష్, ఎల్లం, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి షుగర్స్ మైసమ్మ ఆలయంలో పూజలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ ఆవరణలో గల మైసమ్మ ఆలయంలో డిస్టలరీ సెక్షన్ ఆధ్వర్యంలో శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు చేశారు.కార్యక్రమంలో ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు, డిస్టలరీ జనరల్ మేనేజర్ సుబ్బారావు, మేనేజర్ రెడ్డయ్య, పర్సనల్ మేనేజర్ బస్వపున్నా రెడ్డి,ఫైనాన్స్ మేనేజర్ మాలకొండయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

బోనాల ఊరేగింపు



భిక్కనూరు: మండల కేంద్రంలో ఆషాఢమాసం సందర్భంగా సిద్ధార్థ విద్యాలయం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపును శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా భాజభజంత్రీలతో మండల కేంద్రంలోని పలు వీధుల గుండా విద్యార్థినులు బోనాలను ఎత్తుకుని ఊరేగించారు. విద్యార్థినులు నవదుర్గ దేవి అవతారాల్లో, విద్యార్థులు పోతరాజుల అవతారాల్లో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. తదుపరి మహంకాళీ అమ్మవారికి, భూలక్ష్మి అమ్మవారికి, ఊరడమ్మకు బోనాలను సమర్పించి పెద్ద ఎత్తున ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బండి సుధాకర్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శబరిమాత దివ్యసమాధి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ఆవరణలో పల్లకీ సేవా నిర్వహించారు. కార్యక్రమంలో బాపురావు, గంగారాం, సిద్దిరాంరెడ్డి, లక్ష్మీపతి, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నాగులబండకు జీర్ణోద్ధారణ పున:ప్రతిష్ఠ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద గల నాగులబండ వద్ద శుక్రవారం జీర్ణోద్ధారణ పున:ప్రతిష్ఠ కార్యక్రమ పనులు వేద బ్రాహ్మణుడు సంతోష్‌కృష్ణ శర్మ ప్రారంభించారు. రోడ్డు విస్తరణలో భాగంగా నాగులబండ పూర్తిగా కుంగి పోయింది. దీంతో నాగపడగ రోడ్డుకు సమానంగా కావడంతో ఉండడం గ్రామానికి మంచిది కాదని భావించి వేద పండితుల ఆధ్వర్యంలో పున:ప్రతిష్ఠ కోసం పనులను ప్రారంభించారు. మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ వంకాయల రవి, శివాలయ కమిటీ చైర్మన్ రాజయ్య, మాజీ చైర్మన్ కొప్పుల నర్సారెడ్డి, నాగులబండ ప్రతిష్ఠ నిర్వహకులు పోసాని దుర్గయ్య, వివిధ కుల సంఘాల ప్రతినిధులు రాజేందర్, రాజయ్య, నర్సింలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

అన్నిరంగాల్లో చిన్న సంఘాలు అభివృద్ధి చెందాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో గల చిన్న సంఘాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సీసీ రమేశ్‌గౌడ్ అన్నారు. తాడ్వాయి మండలకేంద్రంలోని గ్రామసమాఖ్య కార్యాలయంలో గ్రామ సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు.ఆర్థిక లావాదేవీలపై చర్చించారు. ఈఅవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీవోఏలు అనిత, సుజాత, పొదుపుసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అభినందన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజివాడి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను వీడీసీ చైర్మన్ మడిపెద్ది ఆనంద్, ఎల్లాగౌడ్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించి శాలువాలతో సత్కరించారు.

దుస్తుల పంపిణీ

మండలంలోని కల్వరాల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుకుని ట్రిపుల్ ఐటీకి ఎంపికైన దివ్యతోటి విద్యార్థులకు 40 జతల దుస్తులను పంపిణీ చేశారు. వీడీసీ చైర్మన్ రాజిరెడ్డి, కోశాధికారి గుర్రపు రాజులు, ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

మాచారెడ్డి: ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు ఈనెల 27న కామారెడ్డిలో నిర్వహించనున్న అలయ్ బలయ్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు లక్ష్మీరాజం, బాలరాజు, చంద్రం నారాయణ రామచంద్రం తదితరులు ఉన్నారు.

సిండికేట్ యూత్ క్లబ్ నూతన కార్యవర్గం

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో సిండికేట్ యూత్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాశీగల్ల రాజు, కోశాధికారిగా భరత్ రాజు ఆర్గనైజర్‌గా విలియంలు ఎన్నికయ్యారు.నూతన అధ్యక్షుడు కాశీగల్ల రాజు మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ప్రహరీలను నిర్మిస్తామన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నాగిరెడ్డిపేట/లింగంపేట : గ్రామంలో ఇళ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. నాగిరెడ్డిపేట మండలం గోలిలింగాల గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలోని పలురికార్డులను ఆయన తనిఖీ చేశారు. దీంతోపాటు గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు.నీరు నిల్వ ఉంటేచోట బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శి సంతోష్‌ను ఆయన ఆదేశించారు.లింగంపేట మండలం ఆయా గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే ట్యాంకులు, ఇళ్లలోని బ్యారెళ్లు, నీటి తొట్టీలు శుభ్రం చేయాలని పంచాయితీ సిబ్బంది, గ్రామస్తులకు ఎంపీవో మల్హరి సూచించారు. మండలంలోని ఎక్కపల్లి, సజ్జన్‌పల్లి, పర్మళ్ల గ్రామాల్లో ఎంపీవో మలహరి, పంచాయితీ కార్యదర్శులు గ్రామాల్లోని వీధుల్లో పర్యటించి వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్తలు వివరించారు. జీపీ సిబ్బంది ఉన్నారు.